తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-05- సెప్టెంబర్- 2025 | సంపుటి : 3 | సంచిక : 99 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# పరిష్కారం చూపేందుకు ప్రణాళికలను సిద్ధం చేయండి



- రోడ్లు, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి
- కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తా..
- వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది
- నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుంది
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో వరదల నష్టాన్ని అంచనా వేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో







## కవితపై సొంత నేతల అసంతృప్తి

- తాము ఎప్పటికీ కేసీఆర్‌కే కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ
- కవిత నిర్ణయాలతో కార్యకర్తల భవిష్యత్తు ప్రశ్నార్థకమన్న నేతలు
- కవిత సామాజిక న్యాయంపై కీలక నేత రాజీవ్ సాగర్ ప్రశ్నలు
- జాగృతి ఆశయాలు పక్కదారి పడుతున్నాయని ఆరోపణ

2లో





## మద్యం మత్తులో స్కూల్‌కు వచ్చిన టీచర్..

- సస్పెండ్ చేసిన అధికారులు

ఆసిఫాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) :

విద్యార్థులతో పాటు పది మందికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు తప్పటడుగులు వేశాడు.

మిగతా 2లో




## కొత్త రేషన్ కార్డుదారులకు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

- కొత్త రేషన్ కార్డుదారలు ఈ కేవైసీ చేసుకోవాలంటున్న అధికారులు
- సమీపంలో రేషన్‌షాప్‌నకు వెళ్లి వేలిముద్రలు అప్‌డేట్ చేసుకోవాలని సూచన
- బినామీలకు చెక్ పెట్టేందుకే ఈకేవైసీ నిబంధన

2లో





## ముగ్గురు పిల్లల మృతదేహాలు లభ్యం

- నాగర్ కర్నూల్ జిల్లాలో అదృశ్యమైన ముగ్గురు పిల్లల మృతదేహాలు లభ్యం
- ముగ్గురు పిల్లలపై తండ్రే పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు సమాచారం

నాగర్ కర్నూల్, (తెలంగాణ ముచ్చట్లు) :

నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. కల్వకుర్తి మండలం తాండ్ర శివారులో మృతదేహాలు దొరికాయి. చిన్నారులను తండ్రే పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో


## తెలంగాణలో 3రోజులు వర్షాలు..

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో పలుచోట్ల రాగల మూడురోజులు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చియ వాయువ్య దిశగా కదులుతూ తూర్పు మధ్య ప్రదేశ్ వరకు వ్యాపించిందని.. అనుబంధంగా ఉపరితల


మిగతా 2లో



## నగరంలో గణేష్ నిమజ్జనానికి సర్వంసిద్ధం..

- 303 కిలోమీటర్ల శోభాయాత్రలు
- 30 వేల మంది పోలీసులతో భద్రతా బందోబస్తు
- 13 కంట్రోల్ రూమ్‌లు – 160 యాక్షన్ టీమ్స్
- 20 చెరువులు, 72 కృత్రిమ కొలనులు సిద్ధం
- 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు వినియోగంలో
- 9 బోట్లు, 200 గజ ఈతగాళ్లు రక్షణకు
- 14,486 మంది శానిటేషన్ సిబ్బంది నియామకం
- 56,187 విద్యుత్ దీపాలతో మార్గాల వెలుగు

7లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## కవితపై సొంత నేతల అసంతృప్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాంస్కృతిక సంస్థ తెలంగాణ జాగృతిలో అంతర్గత విభేదాలు రాజుకున్నాయి. సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంపై ఆ సంస్థకు చెందిన కీలక నేత మేడే రాజీవ్ సాగర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తామంతా కేసీఆర్ కోసమే పనిచేస్తామని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కవిత తీసుకుంటున్న నిర్ణయాల వల్ల సంస్థలోని కార్యకర్తల భవిష్యత్తు అంధకారంలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ సాగర్ మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి నాయకులమైన మేము ఎల్లప్పుడూ కేసీఆర్ కోసమే పని చేస్తాం. ఆయన నిర్ణయమే మాకు శిరోధార్యం. కానీ, కవిత గారు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల 19 ఏళ్లుగా సంస్థ కోసం కష్టపడిన వారి జీవితాలు, రాజకీయ భవిష్యత్తు ఏం కావాలి? అని ప్రశ్నించారు. జాగృతి సంస్థ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఆశయాల కోసం పనిచేయాలని, కానీ ఇప్పుడు ఎవరి కోసం, ఎవరి ఆశయాల కోసం పనిచేస్తోందో అర్థం కావడం లేదని విమర్శించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న కవితకు రెండుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశాలు వచ్చాయని గుర్తు చేశారు. ఆమె వెనుక నడిచిన కార్యకర్తలకు ఎలాంటి సామాజిక న్యాయం జరిగిందని నిలదీశారు. కవిత వ్యక్తిగత ఎజెండాతో పనిచేస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. రాత్రింబవళ్లు మేం కవిత చెప్పినట్లు పని చేశామని, కానీ ఆమె తీసుకున్న నిర్ణయం పట్ల తామంతా బాధపడుతున్నామని అన్నారు. కవిత చేసిన పని వల్ల మా జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# పరిష్కారం చూపేందుకు ప్రణాళికలను సిద్ధం చేయండి

కామారెడ్డి, (తెలంగాణ ముచ్చట్లు)





భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగిన చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదల వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. రోడ్లు, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి స్థానికులతో మాట్లాడారు. కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తానని మాటిచ్చారు. వరద నష్టంపై గ్రామాల వారిగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జీలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పంట నష్టానికి సహాయం అందిస్తామన్నారు.

ఇటీవలి భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, తోట లక్ష్మీ కాంతారావు, కాటిపల్లి వెంకట రమణారెడ్డితో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. "వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుంది. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో వరదల నష్టాన్ని అంచనా వేయాలి. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు కూడా అంచనాలు రూపొందించాలి" అని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

"వరదల వల్ల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గారు ప్రజలకు అండగా నిలిచారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు. ఎమ్మెల్యే గారి లాగే కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా. వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు భారీ వరదను కూడా తట్టుకుని నిలబడి అందర్నీ కాపాడిరది. తాత్కాలిక మరమ్మతులు చేశాం. అయితే ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం.." అని ముఖ్యమంత్రి గారు బాధితులకు భరోసానిచ్చారు. మొదట తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి గారు ప్రజాప్రతినిధులతో కలిసి వరదల వల్ల దెబ్బ తిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల వల్ల లింగంపేటలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి బ్రిడ్జిని పరిశీలించారు. వరదలు వచ్చిన సందర్భంగా ఉత్పన్నమైన పరిస్థితులపై అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

అక్కడ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం తాత్కాలిక మరమ్మతులతో కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి కమ్ బ్యారేజీ లేదా బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కామారెడ్డి జీఆర్ కాలనీ సందర్శించిన సందర్భంగా ముఖ్యమంత్రి గారు బాధితులతో మాట్లాడారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, పశుసంపద కోల్పోయిన వారికి సాయం అందించాలని ఆదేశించారు. "భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆస్తినష్టం జరిగినప్పటికీ అప్రమత్తంగా ఉండటం ప్రాణ నష్టం తగ్గించగలిగాం.

వరదలు రాగానే క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందిగా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క గారిని, సలహాదారు షబ్బీర్ అలీ గారిని, ఎంపీ సురేష్ షేట్కర్ గారిని, ఎమ్మెల్యేలను ఆదేశించాను. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వంద శాతం ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.. అని ముఖ్యమంత్రి గారు స్పష్టంగా చెప్పారు. కామారెడ్డి చేరుకునే సమయంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా జిల్లాలో నష్టపోయిన ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు.



## మద్యం మత్తులో స్కూల్‌కు వచ్చిన టీచర్..

(మొదటి పేజీతరువాయి)

పీకల దాకా మద్యం సేవించి పాఠశాలకు హాజరయ్యాడు. విచారణ చేపట్టిన అధికారులు.. ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూరు మండల పరిధిలోని సుకుతుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో జే విలాస్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే గత కొంతకాలం నుంచి ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు హాజరవుతున్నాడు. అంతే కాకుండా పాఠాలు బోధించకుండా, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఉపాధ్యాయుడు విలాస్‌పై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అనంతరం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కొత్త రేషన్ కార్డుదారులకు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)




ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేసిన సంగతి తెలిసిందే. కార్డులు పొందిన వారు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కొత్త రేషన్ కార్డులో పేర్లున్న కుటుంబ సభ్యులందరు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈపాస్ యంత్రంలో బయోమెట్రిక్ వేలిముద్రలను(ఫింగర్ ప్రింట్‌లను) అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని గత రెండేళ్ల నుంచి సర్కారు పలుమార్లు పేర్కొంది. గడువు పెంచుకుంటూ వెళ్తోంది. కామారెడ్డి జిల్లాలో 26,521 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వారికి సెప్టెంబరు నెలలో కోటా బియ్యం కూడా విడుదల చేశారు. 40 వేల మంది కుటుంబ సభ్యులకు సంబంధించి పేర్లను పాత కార్డుల్లో జమ చేశారు. వీరు కూడా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం 2,83,253 రేషన్‌కార్డులు ఉండగా అందులో 86 శాతం మంది ఈకేవైసీ చేయించుకున్నారు. మిగతా కార్డుదారులు త్వరగా చేయించుకోవాల్సి ఉంటుంది. ఈకేవైసీ చేయించుకోని వారికి బియ్యం బంద్ చేస్తామని కేంద్రం గతంలో పేర్కొంది. ఎందుకంటే ఆధార్‌కు ఈపాస్ యంత్రానికి అనుసంధానం చేయడం వల్ల బినామీలు బియ్యం తీసుకోవడానికి వీలుండదు. అందుకే కేవైసీ నిబంధన విధించారు. ఆధార్ అప్‌డేట్ లేకపోవడం వల్ల కొంతమందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరు ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయించుకున్నప్పటికీ ఈకేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడం లేదు. ఇదేంటని ఇతర ఆధార్ కేంద్రాలకు వెళ్లి తెలుసుకుంటే ఆధార్ నవీకరణ పూర్తి కాకపోవడం వల్ల ఈకేవైసీ తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో లబ్ధిదారులు వేర్వేరు ఆధార్ సర్వీస్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్ నవీకరణ పూర్తికాకపోవడం వల్ల చిన్నారులు ఈకేవైసీకి దూరమవుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో ఆధార్ కేంద్రాలు తక్కువ ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆధార్ సెంటర్లు లేని మండలాల ప్రజలు ఇతర మండలాలకు వెళుతున్నారు. అధికారులు స్పందించి కనీసం మండలానికి ఒక ఆధార్ కేంద్రాన్ని అయినా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు. గడిచిన ఏడాదిగా జిల్లాలో ఐదారు ఆధార్ కేంద్రాల సర్వీసులను నిలిపివేశారు. జిల్లాలో 25 మండలాలు ఉండగా 10 ఆధార్ సెంటర్లు మాత్రమే కొనసాగుతున్నాయి. మిగతా మండలాల్లో మాత్రం ఆధార్ కేంద్రాలు లేవు. ఈ విషయమై డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు మాట్లాడుతూ కొత్తకార్డుదారులు ఈకేవైసీ చేయించుకుంటే వారికే మంచిదని వివరించారు.

## తెలంగాణలో 3రోజులు వర్షాలు..

(మొదటి పేజీతరువాయి)



ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. రాబోయే 24గంటల్లో తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా పశ్చియ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, సగటు సముద్రమట్టం వద్ద రుతుపవన ద్రోణి జైసల్మేర్, కోట, నర్మదాపురం, సియోని, చాంద్‌బలీ మీదుగా అల్పపీడన ప్రాంతం కేంద్రం మీదుగా తూర్పు ఆగ్నేయం వైపు వాయువ్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉందని.. సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. ఉపరితల ఆవర్తనం గుండా ప్రయాణిస్తుందని పేర్కొంది. దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర మీదుగా ద్రోణి ఈశాన్య అరేబియా సముద్రం నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు ప్రయాణిస్తుందని.. మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఉందని వివరించింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్‌లో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిశాయి.

## ముగ్గురు పిల్లల మృతదేహాలు లభ్యం

(మొదటి పేజీతరువాయి)



ముగ్గురు పిల్లలతో ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఓ ఎరువుల వ్యాపారి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ వ్యాపారి పిల్లల ఆచూకీ మాత్రం లభించలేదు. ఈ ఘటన బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన వ్యాపారి (38)కు భార్య, కుమార్తెలు(8),(6), కుమారుడు (4) ఉన్నారు. ఆయన ఎరువుల దుకాణాన్ని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, గత నెల 30న సాయంత్రం 5 గంటలకు స్కూల్‌కు వెళ్లిన ముగ్గురు పిల్లలను వ్యాపారి బైక్‌పై తీసుకెళ్లారు. అనంతరం ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్ వద్ద ఓ హోటల్ సీసీ ఫుటేజీ ఆధారంగా అక్కడ ఇద్దరు పిల్లలను దించి పెద్ద కుమార్తెతో వంగూరు మండలం కోనేటిపూర్ సమీపంలోని టోల్‌గేట్, చారకొండ మండలం జూపల్లి దాబా వరకు బైక్‌పై వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం శ్రీశైలం హైదరాబాద్ నేషనల్ హైవే పైన వెల్దండ మండలం పెద్దాపూర్ రెవెన్యూ శివారున బుర్రకుంట సమీపంలో చెట్ల మధ్య వ్యాపారి విగతజీవిగా పడి ఉండటాన్ని కొందరు రైతులు గమనించారు. అక్కడ బైక్, పురుగు మందు డబ్బా కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వెల్దండ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కుటుంబ సభ్యులతో స్థానిక ఎస్ఐ ఎస్.కురుమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా తన వెంట తీసుకెళ్లిన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని వెంకటేశ్వర్లు ఏమైనా చేసి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా పిల్లలను విడిచిపెట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడా? అనేది మిస్టరీగా మారింది. దీనిపై అన్ని కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు తండ్రితో వచ్చి అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల ఆచూకీ కోసం పోలీసులు గాలించారు. గత నెల 31న అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి అచ్చంపేట మండలం హాజీపూర్ మీదుగా నల్గొండ జిల్లా డిరడి వైపు వెళ్లినట్లు వారు తెలుసుకున్నారు. దీంతో అప్రమత్తమై అచ్చంపేట, ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లకు చెందిన పోలీసులు డ్రోన్ కెమెరాతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఆచూకీ లభించకపోవడంతో గురువారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. కల్వకుర్తి మండలం తాండ్ర శివారులో అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి.

తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం-05- సెప్టెంబర్ 2025








# ప్రజల గోడును ప్రభుత్వానికి వినిపించేందుకు సీపీఎం ఇంటింటికీ సర్వే!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు ):** వేంసూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ (దళితవాడ)లో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ సర్వే నిర్వహించబడింది. గ్రామశాఖ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

కాలనీలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండటం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని స్థానికులు వాపోయారు. బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, దోమల మందు పిచికారి చేయకపోవడం వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల భయం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చర్చి వెనుక నిర్మించిన సీసీ రోడ్డు లో లెవెల్‌లో ఉండటం వలన వర్షాకాలంలో నీరు నిలిచి దోమల విస్తరణకు కారణమవుతోందని నివాసితులు వివరించారు. అలాగే విజయవాడ రహదారిలోని పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిల్వ ఉండటం వలన ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీధి కుక్కల సమస్య రోజురోజుకి పెరుగుతోందని, వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శానిటేషన్ సమస్యలపై అధికారులు పంచాయతీ నిధులు లేక పనులు చేయలేకపోతున్నారని చెబుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు మురుగునీరు, పిచ్చిమొక్కల కారణంగా వ్యాధుల బారిన పడే ప్రమాదంలో ఉన్నారని ఐసీడీఎస్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

"ప్రజల సమస్యలను పాలకులు విస్మరిస్తున్నారు. ఈ గోడును ప్రభుత్వానికి వినిపించడం సీపీఎం బాధ్యత" అని గ్రామశాఖ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మోరంపూడి వెంకటేశ్వరరావు, శాఖ సభ్యులు బూరుగు శ్రీదేవి, రాణీ రుద్రమ్మదేవి, వ్యవసాయ కార్మికులు పొన్నంపల్లి ప్రసాద్, మూడుదొడ్ల సరోజిని, భూషణం, విమలమ్మ, నిర్మల, ఝాన్సీ, డేజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# 24 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ శంకుస్థాపన**

**మీర్పేట్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఇంద్రనగర్ ఫేజ్ 2 మరియు మంగాపురం కాలనీల్లో రూ!24 లక్షల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం: ఎమ్మెల్యే మాట్లాడుతూ,

కాలనీ వాసుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కోసం కృషి చేస్తాను. ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం,అని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ,డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ పనుల కోసం సహకరించిన ఎమ్మెల్యేకి మరియు స్థానిక నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.స్థానిక నాయకులు, ప్రజల ఉత్సాహం ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ ప్రెసిడెంట్ వంజరి ప్రవీణ్ కరిపే, వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, కాలనీ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, సతీష్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, కృష్ణమూర్తి, కనకయ్య, అలీముద్దీన్, సలీముద్దిన్, ఉల్లెం బాలరాజు, సాయి కుమార్, బాలయ్య గౌడ్, చారి, రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.స్థానిక కాలనీవాసులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించి, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.





# బాలాజీ ఎంక్లేవ్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

**డివిజన్‌లోని అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు – కార్పొరేటర్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్‌లోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీ పార్క్ అభివృద్ధి మరియు సుందరీకరణ పనులను గురువారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ స్వయంగా పరిశీలించారు. జిహెచ్ఎంసి హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను కాలనీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. భారీ నిధులతో పార్కుల అభివృద్ధి:పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ, పార్కులను మరింత ఆకర్షణీయంగా మార్చే కృషిలో భాగంగా డివిజన్‌లోని అన్ని పార్కులకు భారీ నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు అందిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు.ఈ క్రమంలో కొత్తగా గజబో, బెంచీలు, గార్డెన్ గ్రాస్, కాంపౌండ్ వాల్ పెయింటింగ్ పూర్తి చేయడం జరిగిందని వివరించారు.కాలనీ సభ్యుల అభ్యర్థనలు - అధికారులకు ఆదేశాలు:పార్కులో మరిన్ని బెంచీలు, గజబో చుట్టూ ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్‌కు మరిన్ని పెయింటింగ్ పనులు చేయాలని స్థానిక నివాసితులు కోరగా, హార్టికల్చర్ అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని గీతా ప్రవీణ్ ఆదేశించారు.సీనియర్ సిటిజన్ల ప్రశంసలు :స్థానిక సీనియర్ సిటిజన్లు మాట్లాడుతూ, "డివిజన్‌లో ఇంత పెద్ద ఎత్తున పార్కుల అభివృద్ధి ఇప్పటివరకు ఎవరూ చేపట్టలేదు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం గీతా ప్రవీణ్ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది," అని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బాలాజీ ఎంక్లేవ్ మాజీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్, కమిటీ సభ్యులు రమణ, కెనడీ, షేక్ మస్తాన్ వలి, సిద్దేశ్వర్, శ్రీనివాస్ చారి, శశి కుమార్, భరత్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కేశవరెడ్డి, ప్రదీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, మహమూద్ హాజరయ్యారు.



# వికలాంగులలో చైతన్యం నింపుతున్న వికలాంగుల వాయిస్ మాసపత్రిక

**11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ రాధికా గుప్తా**

**మేడ్చల్ జిల్లా కలెక్టర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** వికలాంగుల సంక్షేమం, హక్కుల రక్షణ, వారి ప్రతిభకు వేదిక కల్పించడం లక్ష్యంగా 11 ఏళ్లుగా కొనసాగుతున్న వికలాంగుల వాయిస్ మాసపత్రిక 11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ రాధికా గుప్తా గురువారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్, జిల్లా నాయకులు ఎస్. రమేష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ, "వికలాంగుల సమస్యలను వెలుగులోకి తెచ్చి, వారికి సామాజిక న్యాయం సాధించేందుకు వికలాంగుల వాయిస్ మాసపత్రిక చేస్తున్న కృషి ప్రశంసనీయం. వికలాంగుల శ్రేయస్సు కోసం ప్రభుత్వ పథకాలను మరింత విస్తృతంగా ప్రచారం చేయడంలో ఈ మాసపత్రిక విశేష పాత్ర పోషిస్తోంది. ఈ ప్రయత్నాలు ఇతరులకు స్ఫూర్తిదాయకం" అని అన్నారు.రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్ మాట్లాడుతూ, "సమాజంలో వికలాంగుల పట్ల దృక్పథం మారేందుకు మీడియా సహకారం అవసరం. మా పత్రిక ఆ దిశగా ప్రతిరోజు కృషి చేస్తోంది. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగుల వాయిస్ పత్రిక గత పదకొండు సంవత్సరాల్లో చేసిన సేవా కార్యక్రమాలు, వికలాంగుల విజయగాథలు, ప్రభుత్వ పథకాల వివరాలు, వివిధ సమస్యలపై చేసిన ప్రత్యేక కథనాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమం అనంతరం పాల్గొన్న ప్రతినిధులు వికలాంగుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమని తెలిపారు.




# మల్కాజ్గిరి పోలీసుల విన్నపం: వినాయక నిమజ్జనానికి ప్రత్యేక మార్గదర్శకాలు

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మల్కాజ్గిరి పోలీస్ శాఖ నిర్వాహకులకు ముఖ్య సూచనలు జారీ చేసింది. ఓల్డ్ మల్కాజ్గిరి, మీర్జాల్గూడ, యాదవనగర్, లాలగూడ మరియు పి.వి.యన్. కాలనీ ప్రాంతాల నుండి నిమజ్జనానికి తరలించబోయే 7 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న వినాయక విగ్రహాలను ఆర్‌కే నగర్ రైల్వే అండర్ బ్రిడ్జ్ మార్గంలో తీసుకెళ్లరాదని పోలీసులు స్పష్టం చేశారు. అండర్ బ్రిడ్జ్ ఎత్తు తక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరుగే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు మల్కాజ్గిరి పోలీస్ శాఖ వెల్లడించింది.పెద్ద విగ్రహాలను తరలించే వాహనాలు మల్కాజ్గిరి ఎక్స్ రోడ్, మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్ ముందు, ఉప్పరిగూడ, జెడ్టీసీ చౌరస్తా మార్గం ద్వారా నిమజ్జన స్థలాలకు తరలించాలని పోలీసులు సూచించారు. స్థానిక ట్రాఫిక్‌పై భారం పడకుండా సకాలంలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండప నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు.వినాయక నిమజ్జన కార్యక్రమాలు భద్రతగా, శాంతియుతంగా సాగేందుకు అన్ని విభాగాల సిబ్బందిని మోహరించనున్నట్లు మల్కాజ్గిరి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ తెలిపారు. ప్రజలు, నిర్వాహకులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమీక్ష

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులు ఆదేశించారు. ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో జలమండలి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కీలక అంశాలపై సమగ్ర చర్చ జరిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (యుజిడి) పనులు మరియు త్రాగునీటి పైపులైన్ విస్తరణ పనులు నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని సూచించారు. కౌకూర గృహకల్పలో మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా పెండింగ్ పనులను తక్షణం పూర్తి చేయడం ద్వారా ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

కోకూర్ జనప్రియ ఆర్కేడ్ సమస్యల పరిష్కారానికి అఫిడవిట్ సేకరించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మచ్చబొల్లారం పరిధిలోని ఏడు కాలనీలకు ట్రంక్ మెయిన్ ఏర్పాటు పనులను 50:50 నిధుల నిష్పత్తిలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే పంచశీల కాలనీలో త్రాగునీటి సరఫరా పనులు త్వరలో ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే బోర్ వెల్స్ మీటర్ల అనుసంధానంపై జిహెచ్ఎంసి, జలమండలి విభాగాల మధ్య సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "మల్కాజ్గిరి అభివృద్ధి నా ప్రాధాన్యత. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపాదనలను మంజూరు చేయించేందుకు ముమ్మరంగా కృషి చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జలమండలి మేనేజర్ సునీల్, డీజీఎంలు సాంబయ్య, రాజు, మేనేజర్లు మల్లికార్జున్, సృజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# శ్రీ ఆదర్శలో స్వయంపాలన దినోత్సవం


**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4, తెలంగాణ ముచ్చట్లు:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో స్వయంపాలన దినోత్సవం గురువారం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయ అవతారం ఎత్తి పాఠాలు బోధించారు. రోజంతా ఉపాధ్యాయులుగా విద్యార్థులు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ఆదర్శ ప్రాయమని శ్రీ ఆదర్శ విద్యాలయం కరస్పాండెంట్ బోడేపుడి కిరణ్ పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యా బోధన చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వి.ఎస్.టి. కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై కార్పొరేటర్ పర్యటన

**నాచారం, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ లో వి.ఎస్.టి. కాలనీలో కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారుల తో కలిసి పర్యటించారు.ఈసందర్భం గా కాలనీవాసులు తమ సమస్యలను వివరించారు.స్థానికులు డ్రైనేజీలలో మట్టి తొలగింపు పనులు జరగకపోవడం వల్ల చెరువులు, కాలువలు మూసుకుపోతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రేణుక ఎల్లమ్మ గుడి ముందు వీధి మరియు పక్క వీధుల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, “డ్రైనేజీ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇప్పటికే సిమెంట్ రోడ్లకు మంజూరు లభించింది. కొత్త బడ్జెట్ లో ఈ పనులు చేర్చబడ్డాయి. త్వరలోనే రోడ్ల పనులు కూడా పూర్తి చేస్తాము” అని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, సివరేజ్ సూపర్వైజర్ రాకేష్, కాలనీవాసులు జాన్ వెస్లీ, సుగుణాకర్ రావు, వాసు, రోహిత్, బారస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.



# ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి” అని ఆకాంక్షించారు. రామాంతపూర్ మెయిన్ రోడ్డులోని డిమార్ట్ వద్ద లక్ష్మి గణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని, రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్ రావు ఆధ్వర్యంలోని వినాయక మండపాన్ని సందర్శించారు. అదేవిధంగా టివి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, ఉప్పల్ మహంకాళి యూత్ అసోసియేషన్, గోకులే నగర్ హబ్సిగూడ డివిజన్‌లో వినాయక యూత్ అసోసియేషన్ నిర్వహించిన మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వినాయక మండప సభ్యులు పాల్గొన్నారు. రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొని సేవా కార్యక్రమాలను అభినందించారు.



# మహంకాళి ఫ్రెండ్స్ అసోసియేషన్ పూజా కార్యక్రమాల్లో దంపతుల సందర్శన

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మహంకాళి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో సాయి కిరణ్, స్వప్న, సురేష్, సరిత, ఆశిష్ దంపతులు ప్రత్యేకంగా హాజరై గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల శ్రద్ధతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.అసోసియేషన్ అధ్యక్షులు మరియు సభ్యులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది వినాయక చవితి మరియు ఇతర పండుగల సందర్భంగా సమాజంలో ఐక్యతను పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈసందర్భంగా స్థానికులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పూజా ప్రాంగణం విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అందంగా అలంకరించబడింది. కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రమించిన అసోసియేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

# నాగారం పలు కాలనీలలో వినాయక పూజలో పాల్గొన్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



**నాగారం, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్, హనుమాన్ నగర్ పలు కాలనీలలో వినాయక చవితి సందర్భంగా ఘనంగా వినాయక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ నాగేందర్ పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.కాలనీ అసోసియేషన్ సభ్యులు మండపాల వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో శాంతి భద్రతలు, శుభ్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేతలు అధికారులను కోరారు. పూజల్లో స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకుడిని ప్రార్థించారు.





# వినాయక మండపాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**రామంతాపూర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామంతాపూర్ డివిజన్‌లో భక్తి శ్రద్ధలతో గణనాథుని మండపాలు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి . భారత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రామంతాపూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు.గణనాథుని ప్రత్యేక దర్శనం తీసుకుని పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక కాలనీవాసులతో పరమేశ్వర్ రెడ్డి మాట్లాడారు. సమాజంలో ఐక్యత, సామరస్యానికి వినాయక ఉత్సవాలు వేదికవుతున్నాయని, ఈ విధమైన ఉత్సవాల ద్వారా ప్రజల మధ్య స్నేహ భావం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు .ఈ సందర్భంగా కాలనీవాసులు పరమేశ్వర్ రెడ్డిని ఆత్మీయంగా ఆహ్వానించి తమ సమస్యలను వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, స్థానిక పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# చిల్కానగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా

**చిల్కానగర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్కానగర్, ఉప్పల్ డివిజన్లలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి వీధి, ప్రతి వాడలో గణనాధుని మండపాలు వెలిసి భక్తులతో సందడిగా మారాయి. ఈ ఉత్సవాల సందర్భంగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.కార్పొరేటర్ మాట్లాడుతూ, “ఈ ఏడాది చిల్కానగర్ డివిజన్‌లో గతంతో పోలిస్తే మరింత విస్తృతంగా గణేష్ మండపాలు ఏర్పడ్డాయి. మండప నిర్వాహకులు అంగరంగ వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. నిమజ్జన సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలి. ముఖ్యంగా పోలీస్ శాఖ నిమజ్జన ప్రదేశాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం” అని తెలిపారు.బాలాజీ ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని మండపాన్ని సందర్శించి గీతా ప్రవీణ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో లడ్డూను కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి రూ.62,000లకు సొంతం చేసుకున్నారు. స్వామివారి దొతిని రూ.32,000లకు శరభయ్య, కలశాన్ని రూ.24,999లకు స్వరూపారాణి సొంతం చేసుకున్నారు.అదే కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లలు, మహిళలు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో గెలుపొందిన వారికి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ బహుమతులు అందజేశారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో కలసి భక్తి భావంతో గణనాధుని వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో కాలనీf అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి వీధి భక్తి గీతాలతో మార్మోగిపోగా, అలంకరించిన మండపాలు దర్శనార్థులతో కళకళలాడాయి.





# గణపయ్య ఆశీస్సులు పొందిన సోయం వీరభద్రం!

**దమ్మపేట మండలంలో పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు**

దమ్మపేట, సెప్టెంబర్ 04(తెలంగాణ ముచ్చట్లు): అశ్వరావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సోయం వీరభద్రం ఆదివారం దమ్మపేట మండల పరిధిలో పలు శుభకార్యక్రమాలలో పాల్గొన్నారు. లింగాలపల్లి గ్రామంలో గణపయ్యను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే వెంకటాద్రిగూడెం గ్రామస్థుల ఆహ్వానం మేరకు గణపయ్యను దర్శించి భక్తులతో కలసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. చిన్నగొల్లగూడెంలో గుర్రం నరసింహారావు, వరలక్ష్మి దంపతుల కుమార్తెలు నాగసౌజన్య, నాగవల్లికల ఓణీల వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాలలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రావు జోగేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, జలగం శ్రీను, గాజుబోయిన ఏసుబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పాకనాటి శ్రీను, సోయం రాజబాబు, చవ్వా అయ్యప్ప, కేసిని నాని, కంధుకూరి మహాలక్ష్మముడు, రాంబాబు, మచ్చల శ్రీను, గుర్రం ముత్యాలరావు, చేపా చలమరావు, ఆనందరావు, రమేష్, పాయం సూర్యం, గుండి లాలూ, ప్రతాప్, నందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్ లో సర్పంచ్ బరిలోకి డి.ఎస్. మహేష్

**పెద్దమందడి,సెప్టెంబర్4(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామం నుండి చిన్న వయసులోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కాంగ్రెస్ నాయకుడు డి.ఎస్. మహేష్, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. మూడు దశాబ్దాలుగా ఉద్యమాలు, పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజల్లో గుర్తింపు పొందారు.

**దళిత ఉద్యమం నుంచి గుర్తింపు**

1994లో మహేష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ద్వారా మాదిగ జాతి చైతన్యానికి కృషి చేసి, “దండోరా మహేష్”గా పేరు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ నేతలైన చిన్నారెడ్డి, మంద జగన్నాథం అనుచరుడిగా ప్రారంభించి, తరువాత రాష్ట్ర మంత్రి సి.నిరంజన్ రెడ్డి సన్నిహితుడిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగారెడ్డితో కూడా సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు.

స్థానిక రాజకీయాల్లో పాదం మోపిన మహేష్ గ్రామంలో కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా పోటీ చేశారు. స్వల్ప తేడాతో విజయం అందుకోలేకపోయినా వెనుకడుగు వేయలేదు. అనంతరం రాజకీయ పరిస్థితుల దృష్ట్యా



బీఆర్ఎస్ పార్టీలో చేరి చురుకైన పాత్ర పోషించారు. అయితే కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత తన పాత బాటలోకే వచ్చారు. ఇప్పుడు వెల్టూరులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ వస్తే సుదీర్ఘ రాజకీయ అనుభవం నిజమైన నాయకుడైన డిఎస్ మహేష్ లో ప్రజలు గుర్తించి గెలిపిస్తే దళిత కుల సంక్షేమం అభివృద్ధి చెందుతుందని కొందరు భావిస్తున్నారు. అగ్రవర్ణాల అనుచరులైన వారిని రాజకీయాల్లో నిలబెట్టి తిరిగి

**మహేష్ బలాలు**

మాట చాతుర్యం, దూకుడు

ఎమ్మెల్యేలు, ఎంపీలతో సన్నిహిత సంబంధాలు

సోదరుడు హంసు వర్మ – నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి శిష్యునిగా, హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా సేవలు, ఎంపీ మల్లురంతో సన్నిహిత సంబంధాలు ఉండటం.

**మహేష్ బలహీనతలు**

ముక్కుసూటితనం

ఉన్నది ఉన్నట్టే చెప్పే స్వభావం వల్ల కొందరికి అభ్యంతరం

అగ్రవర్ణాల వారే రాజకీయాలు చేయడంతో దళిత వర్గాలకు అన్యాయం జరుగుతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాయితీగల డిఎస్ మహేష్‌కు అవకాశం ఇచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేసే విధంగా సహకరిస్తే బావుంటుందని పలువురు గ్రామస్తులు కోరుకుంటున్నారు.

**వ్యక్తిగత జీవితంలో ఎదురుదెబ్బ**

సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న మహేష్, భార్య రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందడం వల్ల తీవ్ర వ్యక్తిగత దెబ్బ తిన్నారు. అయినప్పటికీ రాజకీయాలపై మక్కువ, ప్రజాసేవపై నిబద్ధతతో ముందుకు సాగాలని సంకల్పించారు.

**ప్రజల తీర్పే తుది ఫలితం**

గ్రామ అభివృద్ధి తన లక్ష్యమని మహేష్ చెబుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ప్రజాసేవ చేయాలని సంకల్పించారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తను పోటీ చేస్తే ప్రజలు ఆదరిస్తారని విశేషంగా నమ్ముతున్నారు. దీనికి తోడు అన్ని వర్గాల ప్రజలు కూడా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముఖ్యంగా ఎస్సీ రిజర్వేషన్ వస్తే మహేష్ పోటీ చేస్తేనే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలు ఆయనను ఎంతమేర ఆదరిస్తారో ఎన్నికల ఫలితాల వరకే వేచి చూడాల్సి ఉంది.




# కుషాయిగూడలో శాలివాహన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం ఘనంగా

**కుషాయిగూడ, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ లో కుషాయిగూడ రోడ్ నం.3లో శాలివాహన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ సాయిలుతో పాటు గురుస్వామి, హరిప్రసాద్, చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మహేశ్ గౌడ్ నాయకులు హాజరై నిర్వాహకులను అభినందించారు. ప్రజా సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని వారు అభిలషించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కమిటీ సభ్యులు శ్రమించారు.



# వెల్టూర్ లో అన్నదాతలకు ఘన సన్మానం

**పెద్దమందడి,సెప్టెంబర్4(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం, వెల్టూరు గ్రామంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన వారిని గణేష్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదానం చేసిన వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా అన్నదాతలు పెద్ద శ్రీనివాస్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, గట్లకానాపూర్ చారి, దండు అడివన్న, అలాగే హనుమాన్ యూత్ సభ్యులను గణేష్ నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. నేడు గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం భక్తి-భావనలతో సాగింది. ఈ కార్యక్రమంలో వినయ్ గౌడు, రాజు, మహేందర్, బాలు, అంజి, వినయ్, శివ, అజయ్, యాదయ్య, ఉదయ సాగర్, శివానంద సాగర్, రవీందర్, శివ, రమేష్, బాలు, నరేష్, రాజేష్, మహేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




# రాచకొండ సీపీ సుధీర్ బాబు: వినాయక నిమజ్జనానికి కఠిన భద్రతా ఏర్పాట్లు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు)**

**సరూర్‌నగర్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన సీపీ**
**20 వేల విగ్రహాల నిమజ్జనానికి సన్నద్ధమైన రాచకొండ పోలీసులు**
**12 వేల మంది సిబ్బందితో బందోబస్తు – రాచకొండ సీపీ**

వినాయక నిమజ్జన మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాచకొండ పోలీసు కమిషనరేట్ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ గురువారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరూర్‌నగర్ చెరువును సందర్శించారు. చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఇప్పటి వరకు 3 వేల వినాయక విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, ఇంకా 20 వేల విగ్రహాల వరకు రాచకొండ పరిధిలోని పలు చెరువులు, కుంటల్లో నిమజ్జనం జరగనున్నట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు ఎటువంటి ఆటంకం లేకుండా జరుగేందుకు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని వెల్లడించారు.

సీపీ వివరించిన ప్రకారం, 12 వేల మంది పోలీసు సిబ్బంది నిమజ్జన బందోబస్తులో నియమించబడ్డారు. అదనంగా ట్రాఫిక్ పోలీసులు, షీ టీమ్స్, ఎస్‌ఓటీ టీమ్స్, మెడికల్ ట్రీట్మెంట్ టీమ్స్ మైదానంలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, భద్రతా చర్యల్లో ఎలాంటి లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సరూర్‌నగర్ చెరువులో ఏర్పాటు చేసిన బోటులో ఎక్కి అక్కడి పరిస్థితులను పరిశీలించిన సీపీ, భద్రతా సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. నిమజ్జన సమయంలో ప్రజలు పోలీసు విభాగం సూచనలు పాటించాలని, రహదారులపై ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, స్థానిక పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అహ్మద్‌గూడ 2 బిహెచ్‌కే లబ్ధిదారుల ఆందోళన

**"పాత లెక్కలు తేల్చకుండా ఎన్నికలు ఎందుకు?" అధికారులపై లబ్ధిదారుల ప్రశ్న**



**అహ్మద్‌గూడ, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని అహ్మద్‌గూడ 2 బిహెచ్‌కే హౌసింగ్ కాలనీలో రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియపై లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ఈ విషయం వెల్లడించారు. తాత్కాలిక కమిటీల వసూళ్లు, లెక్కలు అందని పరిస్థితి లబ్ధిదారులు తెలిపారు: గత ఏడాది కాలంగా 41 బ్లాక్‌లలో తాత్కాలిక కమిటీల ఆధ్వర్యంలో మెయింటెనెన్స్ పేరుతో ఒక్కో బ్లాక్ నుంచి రూ.6 నుండి రూ.8 లక్షల వరకు వసూలు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ మొత్తానికి సంబంధించిన లెక్కలు ఎవరికీ అందలేదని ఆరోపించారు. లెక్కలు తేల్చకుండానే అధికారులు ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం సరికాదని స్పష్టం చేశారు. లబ్ధిదారు ల డిమాండ్ నర్సింగ్, సందీప్, పెంటన్న, రాజు, కుమార్ తదితరులు మాట్లాడుతూ:పాత లెక్కలు తేల్చకపోతే, బ్లాక్‌లకు లెక్కలు సరిగా ఉన్నాయనే ఎన్‌ఓసీ తీసుకోకపోతే ఎన్నికలు నిర్వహించడం తప్పు. పూర్వ కమిటీల వసూళ్లపై పైసా పైసా లెక్క ఇవ్వాలి. లెక్కలు చెప్పకపోతే పాత కమిటీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడాలి," అని హెచ్చరించారు.పరిష్కారం కాని సమస్యలు ,ఇటీవల జిల్లా కలెక్టర్ హౌసింగ్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన సమయంలో లబ్ధిదారులు 16 సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వాటిలో ఒక్కటీ పరిష్కారం కాలేదని లబ్ధిదారులు పేర్కొన్నారు.కొన్ని బ్లాక్‌లలో సెల్లార్‌లో నీరు నిల్వ కావడం, లిఫ్ట్‌లు పనిచేయకపోవడం, తొమ్మిదో అంతస్తులో పగుళ్లు ఏర్పడటం, ఫ్లాట్‌లలోని సామాన్లు పాడవడం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని వారు వివరించారు.ఎన్నికల వాయిదా కోరుతున్న లబ్ధిదారులు.ఈ సమస్యలు పరిష్కరించకుండా, లెక్కలు చెప్పకుండా ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలకు ప్రయోజనం ఏంటి?"అని ప్రశ్నించిన లబ్ధిదారులు, అధికారులు ఎన్నికలపై పునరాలోచ న చేసి వాటిని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

# నిద్రపోతున్న నిఘానేత్రం..!

**గ్రామాల్లో కనుమరుగైన సీసీ కెమెరాలు**




**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ గ్రామాల్లో కొన్ని సంవత్సరాల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో దొంగతనాలు, ఆకతాయిల చేష్టలు తగ్గిపోయాయి. రాత్రివేళ బైకులపై తిరుగుతూ భయపెట్టే వారు కూడా కొంత అదుపులోకి వచ్చారు.

కానీ... ఇప్పుడు ఆ కెమెరాలు ఎక్కడికో మాయం అయ్యాయి. ఫలితంగా ఆకతాయిలకు ఎలాంటి అడ్డుకట్ట లేకుండా మారింది. రాత్రివేళల్లో బైకులపై అతివేగంతో తిరుగుతుండటంతో బాటసారులు ప్రాణభయంతో ప్రయాణం చేస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల చోరీలు జరిగితే గుర్తించడం కష్టమవుతోంది. ఎవరైనా ఆకతాయిలుగా ప్రవర్తించినా ఆధారాలు లేకపోవడంతో సులభంగా తప్పించుకుంటున్నారు.

ప్రజల ఆవేదన:

"గ్రామాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఉండాలి. పక్కా పర్యవేక్షణ ఉంటే ఆకతాయిలు భయపడతారు, దొంగతనాలు తగ్గిపోతాయి. అధికారులు వెంటనే కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి" అని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామస్తుల ఆవేదన – "సీసీ కెమెరాలు తిరిగి ఏర్పాటు చేయాలి"

గ్రామాల్లో ఇంతకుముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దొంగతనాలు, ఆకతాయిల చేష్టలకు కొంతమేర అడ్డుకట్ట వేశాయి. కానీ ఇప్పుడు అవి కనుమరుగైపోవడంతో ఆకతాయిలకు అడ్డు లేకుండా పోయింది.

ఇటీవల సముద్రాల నుండి బైక్‌పై వస్తున్న ఓ మహిళపై దాడి జరిగిన ఘటన గ్రామంలో ఆందోళన రేపింది. తానేదార్ పల్లిలో ఆకతాయిలు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని వెళ్లిపోయారు. ఆ మహిళ గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని గ్రామస్థులు తెలిపారు.

గ్రామస్తుడు వందన విజేందర్ రెడ్డి వ్యాఖ్యానిస్తూ: "సీసీ కెమెరాలు లేనందువల్ల ఇలాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. ముందున్న పండుగలు, వినాయక చవితి ఉత్సవాల సమయంలో ఎలాంటి సంఘవిద్రోహ ఘటనలు జరుగుతాయో తెలియడం లేదు. రాత్రివేళల్లో బైకులపై ఆకతాయిలు అతివేగంతో వెళ్లిపోతూ వృద్ధులు, చిన్నపిల్లలు కూడా ప్రమాదంలో పడే పరిస్థితి ఉంది. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకొని మా గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. గ్రామపంచాయతీ అధికారులు కూడా ముందుకు రావాలి. మస్జిద్ ముందు, దేవాలయాల ముందు, చర్చి వద్ద, గ్రామానికి ప్రవేశం దగ్గర, చివర కీలక ప్రాంతాల్లో నిఘానేత్రాలు ఉండాలి. అప్పుడే గ్రామంలో భద్రత ఉంటుంది" అని విజేందర్ రెడ్డి విన్నవించారు.



# గణనాథుని ఆశీస్సులతో నాగారంలో అన్నదానాల వేడుకలు

**నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు**

**నాగారం, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నాగారం మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి కాలనీ లోకల్ కమిటీలు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. భక్తుల కోసం పలు వాలంటీర్లు శ్రద్ధగా సేవలు అందించారు. స్థానికులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై వినాయకుడి ఆశీర్వాదాలను పొందారు.

# అల్వాలలో ఆంజనేయులు ఆకాల మృతి



**పెద్దమందడి,సెప్టెంబర్4(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం, అల్వాల గ్రామానికి స్నేహపూర్వక వ్యక్తిత్వంతో అందరికీ అందుబాటులో ఉండే ఆంజనేయులు (45) ఆకాల మరణం చోటుచేసుకోవడంతో గ్రామమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆంజనేయులు బ్యాంకులో, మహిళా సంఘ బుక్ కీపర్‌గా సేవలు అందించారు. మహిళలకు మార్గదర్శకుడిగా నిలిచి, ప్రతి సమస్యను పరిష్కరించడంలో ముందుండేవారు. గ్రామంలో స్నేహపూర్వకంగా, ఆప్యాయతతో అందరితో కలసిమెలసి జీవించిన ఆయన మృతితో ఊరు శోకసంద్రంలో మునిగిపోయింది. ఆనారోగ్య కారణంగా గురువారం ఆయన తుదిశ్వాస విడిచారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న ఆంజనేయులు మృతి చెందడంతో ఇంట్లోనే కాకుండా గ్రామమంతటా, మండల వ్యాప్తంగా తీవ్ర విషాదం నెలకొంది. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు కన్నీటి నివాళులు అర్పించారు.

# జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ హత్య కలకలం

**మిస్సింగ్‌గా నమోదు అయిన కేసు హత్య గా మారింది**



**జవహర్ నగర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర హత్య జరిగింది. జమ్మిగడ్డ సాకేత్ టవర్స్ పక్కన ఉన్న బహిరంగ ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు మణెమ్మ (37) అనే మహిళ హత్య చేశారు. మణెమ్మ దివంగత రమేష్ భార్య. సెప్టెంబర్ 3న ఆమె కనిపించకపోవడంతో కుమార్తె అనిత జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు నమోదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.గాలింపు చర్యలలో భాగంగా పోలీసులు బుధవారం రాత్రి సాకేత్ టవర్స్ సమీపంలో శోధన జరిపారు. ఈ క్రమంలో బహిరంగ ప్రదేశంలో మహిళ మృతదేహం కనుగొన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో పోలీసులు సంఘటన స్థలాన్ని ముట్టడి చేసి క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు.హత్య వెనుక ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు నిందితులను పట్టుకునే ప్రయత్నాలను వేగవంతం చేశారు.జవహర్ నగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, "మిస్సింగ్ కేసు విచారణలో భాగంగా మహిళ మృతదేహం గుర్తించాం. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశాం" అని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# జగదీశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం

## రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి

**మహబూబ్ నగర్,సెప్టెంబర్4(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం మహబూబ్ నగర్‌లోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద నిర్వహించబడింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై, జగదీశ్వర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డా. చిన్నారెడ్డి -

జగదీశ్వర్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి అనేక కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహించారని గుర్తు చేశారు. పాలమూరు యూనివర్సిటీ స్థాపనకై కృషి చేయడంతో పాటు మహబూబ్ నగర్ పట్టణ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. "జగదీశ్వర్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి" అని డా. చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ హనుమంతు రావు, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ సభ్యుడు వంశీ చంద్ర రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యేన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ నాయకులు సంజీవ్ ముదిరాజ్, మిథున్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లుపాఠశాల కలిసివస్తేనే పిల్లల భవిష్యత్తు వెలుగులు

వైస్ ప్రిన్సిపాల్ యాస్మీన్ షేక్
విద్య అనేది ఇల్లు, పాఠశాల ఉమ్మడి బాధ్యత
పిల్లలకు ప్రేమతో పాటు పరిమితులు, బాధ్యతతో కూడిన స్వేచ్ఛ అవసరం
క్రమశిక్షణ లేకపోతే విద్యా ప్రయాణం అసంపూర్ణం
ఉపాధ్యాయుల కృషి పట్ల గౌరవం పెంచాలని పిలుపు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెయింట్ ఆండ్రూస్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి యాస్మీన్ షేక్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఉపాధ్యాయ దినోత్సవం యువ మనసులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల ప్రాధాన్యతను గుర్తు చేసే రోజు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తమ సమయం, శక్తి, ప్రేమను వెచ్చించే ఉపాధ్యాయుల కృషి అమూల్యం. వారిని గౌరవించడం మన అందరి బాధ్యత, అని ఆమె అన్నారు.తల్లిదండ్రుల పాత్ర ప్రాముఖ్యం:పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర గురించి మాట్లాడుతూ, "పిల్లలకు మంచి విలువలు, క్రమశిక్షణ ఇంట్లోనే నేర్పించాలి. ఇంట్లో ఉన్న క్రమశిక్షణ పాఠశాలలో గౌరవాన్ని పెంచుతుంది. ఉపాధ్యాయులు మార్గదర్శకులు కానీ, తల్లిదండ్రుల స్థానంలో ఉండలేరు, అని యాస్మీన్ షేక్ అన్నారు.నేటి కాలంలో అనేక కుటుంబాలు "సున్నితమైన పేరెంటింగ్" పద్ధతిని అనుసరిస్తున్నా, అది కొన్నిసార్లు అతిగా సడలింపుగా మారి పిల్లల ప్రవర్తనలో అసమతుల్యతను సృష్టిస్తుందని ఆమె హెచ్చరించారు. ప్రతి కోరిక నెరవేరాలనే భావనతో పిల్లలు పెరిగితే, వారు సమాజంలో క్రమశిక్షణ, గౌరవం నేర్చుకోవడం కష్టమవుతుంది," అని ఆమె తెలిపారు.

ఇల్లుపాఠశాల సమన్వయం అవసరం:

విద్య అనేది ఉమ్మడి బాధ్యత. ఇల్లు, పాఠశాల కలిసికట్టుగా పనిచేస్తేనే పిల్లలు వికసిస్తారు. తల్లిదండ్రులు పట్టించుకోని లోటును ఉపాధ్యాయులు సరిచేయాలని ఆశిస్తే, చివరికి నష్టపోవడం పిల్లలకే జరుగుతుంది," అని ఆమె స్పష్టం చేశారు.పిల్లలకు సమతుల్యతను బోధించడమే తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని చెబుతూ, ఆమె ఇలా అన్నారు:"పిల్లలకు పరిమితులతో కూడిన ప్రేమ, బాధ్యతతో కూడిన స్వేచ్ఛ, క్రమశిక్షణతో కూడిన సానుభూతి ఇవ్వాలి. అలా పెరిగిన పిల్లలే సమాజానికి బలమైన, గౌరవప్రదమైన, సమర్థులైన వ్యక్తులుగా అవతరిస్తారు."

ఉపాధ్యాయుల కృషికి గౌరవం అవసరం:

ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు. వారి కృషి అమూల్యం. ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారిని కృతజ్ఞతలతో సత్కరించి, గౌరవించాలి. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో వారి సేవలే మన సమాజానికి వెలుగులు నింపుతున్నాయి," అని యాస్మీన్ షేక్ అన్నారు.





# వనిత టీ స్టాల్ ప్రారంభించిన ఎంపీ డా. కడియం కావ్య, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు)**

స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా టీ స్టాల్ ప్రారంభించిన రాజమ్మను అభినందించిన ప్రజాప్రతినిధులు, "మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలి" అని సూచించారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట: ఎంపీ కావ్య



ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ: తెలంగాణ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు.

మహిళా సాధికారతలో భాగంగా డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ లింకేజీలు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, పౌల్ట్రీ, డైరీ ఫామ్‌లు, రైస్ మిల్లులు మంజూరు చేస్తూ మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

మహిళా సంక్షేమం, భద్రత, ఆర్థిక సావలంబన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారు: ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, మహిళా సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు.





# గీత కార్మికులకు కాటమయ్య సురక్షా కిట్స్ పంపిణీ

## కల్యాణ లక్ష్మి పథకం – పేద కుటుంబాలకు వరం: ఎంపీ కడియం కావ్య

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ పట్టణ రైతు వేదికలో కల్యాణ లక్ష్మి - కాటమయ్య సురక్షా కిట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 02 వేల 784 విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేయగా, నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన 300 మంది గీత కార్మికులకు కాటమయ్య సురక్షా కిట్స్ పంపిణీ చేశారు.

ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ...

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతోనే కల్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు.

ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక బలం కలిగించి, వారి జీవన శైలిని మార్చడమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు.

"అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా అన్యాయం జరిగితే వదలబోము" అని స్పష్టం చేశారు.

తాటి చెట్లపై కష్టపడి జీవించే గీత కార్మికుల రక్షణకై కాటమయ్య కిట్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ...

"స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు చోటు ఉండదు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు నెలల్లో చెక్కులు అందజేస్తున్నాం. ఇందుకోసం ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు" అని అన్నారు.

ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1000 మందికి పైగా లబ్ధిదారులకు 10 కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని వివరించారు. అత్యంత ప్రమాదకరమైన గీత వృత్తిలో కార్మికులు ప్రమాదానికి గురైతే వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని, అందుకే భీమా సదుపాయంతో పాటు సురక్షా కిట్స్ అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 900 మంది గీత కార్మికులకు మూడు విడతల్లో కాటమయ్య కిట్స్ పంపిణీ చేశామని చెప్పారు. అలాగే, రాష్ట్రంలో పేదలకు ఉచిత సన్న బియ్యం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని, తెలంగాణ సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాలు అనుసరిస్తున్నాయంటే మన పాలన గొప్పతనానికి నిదర్శనమని శ్రీహరి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో, ఏక్సైజ్ సూపరింటెండెంట్, తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు.

# భారత్‌తో రష్యా సంబంధాలను గౌరవిస్తాం.. కానీ..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సుకు హాజరైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌కు అన్ని విధాలుగా మద్దతు ఇచ్చి, దక్షిణాసియా ప్రాంతంలో సమతౌల్యతను పాటించినందుకు రష్యాకు షెహబాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో భారత్‌రష్యా సంబంధాల గురించి కూడా పాక్ ప్రధాని ప్రస్తావించడం గమనార్హం. భారత్‌తో రష్యా సంబంధాలను గౌరవిస్తామని, అదే సమయంలో మాస్కోతో తాము కూడా చాలా బలమైన సంబంధాలను కోరుకుంటున్నామని షరీఫ్ వ్యాఖ్యానించారు. ఇవి అనుబంధం, పరిపూర్ణమైనవిగా ఉండాలని పాక్ ప్రధాని అన్న మాటలకు రష్యా అధినేత పుతిన్ చిన్నగా తలాడిరచడం గమనార్హం. సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఈ వీడియోలో.. పుతిన్‌ను డైనమిక్ లీడర్



అంటూ షెహబాజ్ పొగడ్తల్తో ముంచెత్తారు. బహుళ ధ్రువాలుగా మారుతున్న ఈ ప్రపంచంలో రష్యాతో స్నేహం కోసం పాకిస్థాన్ ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలు నేపథ్యంలో చైనా, న్యూఢల్లీ సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైన వేళ మాస్కోతో చెలిమికి పాక్ తహతహలాడటం చెప్పుకోదగ్గ విశేషం. ఇక, తియాంజిన్ వేదికగా జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం భారత్, చైనాలను మరింత దగ్గర చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఇది గొప్ప దౌత్య విజయాన్ని అందించింది. పహల్గామ్ ఉగ్రదాడిని ఎస్‌సీఓని 10 సభ్యదేశాలు ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానంలో పాక్ ప్రస్తావన లేకపోయినా.. దానిపై సంతకం చేసిన వారిలో షెహబాజ్ షరీఫ్ ఉన్నారు. అయితే, చైనాతో పాకిస్థాన్‌కు బలమైన సంబంధాలే ఉన్నాయి. సెప్టెంబర్ 3న బీజింగ్‌లో జరిగే ప్రధాన సైనిక కవాతులో పుతిన్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో సహా కనీసం 26 మంది ప్రపంచ నాయకులు హాజరకానున్నారు. వీరిలో పాకిస్థాన్ ప్రధాని కూడా ఒకరు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ప్రధాని శసెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్లు.. చైనా అదినేత షీ జిన్‌పింగ్‌తో గత నెలలో భేటీ అయ్యారు. వాస్తవానికి ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇచ్చింది. భారత్‌పై దాడులకు చైనా ఆయుధాలను దాయాది వాడిన విషయం తెలిసిందే. అలాగే, గగనతల రక్షణ కోసం చైనా వ్యవస్థను పాక్ వినియోగించగా.. భారత్ దెబ్బకు అది ధ్వంసమైంది. మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టిన ఇండియన్ ఆర్మీ.. పాక్‌కు రక్షణగా ఉన్న చైన్హా రాడార్లు ఏమార్చి.. దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

# పోక్సో కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



కామాంధులకు కోర్టు కఠిన శిక్ష విధించింది. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు భారీ జైలు శిక్షలతో పాటు జరిమానాలు విధించింది. ఈ తీర్పుల ద్వారా బాధితులకు న్యాయం జరిగిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. 2018లో చండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో ఈ ఘటన జరిగింది. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా అనారోగ్యంతో ఇంటి వద్ద ఉన్న 11 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన తిప్పర్తి యాదయ్య కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా పోక్సో కోర్టులో ఈ కేసుపై విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. ఈ క్రమంలో నిందితుడు తిప్పర్తి యాదయ్యకు 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.35,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. మరో కేసులో దేవరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే 8 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. తల్లిదండ్రులు పనులకు వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన భాస్కరాచారి అనే వ్యక్తి టీవీ చూద్దామని ఇంట్లోకి తీసుకువెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులకు చిన్నారి జరిగిన విషయాన్ని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులు 2018 మార్చిలో నిందితుడు భాస్కరాచారిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో రెండేళ్లుగా విచారణ కొనసాగింది. ఈ కేసులో కూడా ప్రాసిక్యూషన్ తరఫున వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. నిందితుడు భాస్కరాచారికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25,000 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ఆదేశించారు. ఈ రెండు కేసుల్లోనూ సరైన వాదనలు, పోలీసుల సమగ్ర దర్యాప్తు కారణంగా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ తెలిపారు.




# బీజింగ్ పరేడ్‌లో రాకాసి అణు క్షిపణి ప్రదర్శన

చైనా తన అత్యాధునిక అణు క్షిపణిని ప్రపంచం ముందుకు తెచ్చింది. దీన్ని డీఎఫ్5సీగా పిలుస్తున్నట్లు గ్లోబల్ టైమ్స్ పేర్కొంది.విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో ఈ క్షిపణి ఆవిష్కరణ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. దీని రేంజ్‌లో భూగోళం మొత్తం వస్తుందని, ఎక్కడున్న శత్రు లక్ష్యాలనైనా ధ్వంసం చేయగల సామర్థ్యం ఉందని చెబుతున్నారు. అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఇది ఛేదించగలదని నిపుణులు అంటున్నారు.ఈ భారీ క్షిపణిని ఒకే వాహనంపై తరలించడం సాధ్యం కాదు. మూడు భాగాలుగా తరలించి, తర్వాత అసెంబ్లింగ్ చేసి ప్రయోగిస్తారు. గత డీఎఫ్5 కంటే దీన్ని వేగంగా సిద్ధం చేయవచ్చని అణు నిపుణుడు ప్రొఫెసర్ యాంగ్ చెంగ్జిన్ వెల్లడిరచారు. దీన్ని భారీ సిలోస్ (బొరియ) నుంచీ ప్రయోగించే వీలుంది. డీఎఫ్5సీ రేంజ్ 20,000 కిలోమీటర్లకు పైగా. అంటే భూమి మొత్తం దీనికి అందుబాటులో ఉంటుంది. భూగర్భ స్థావరాలపై కూడా ఇది దాడి చేయగలదని చెబుతున్నారు. దాడి సమయంలో శబ్దం కంటే పదిరెట్లు వేగంగా ప్రయాణించగల ఈ క్షిపణి కారణంగా ప్రస్తుత గగనతల రక్షణ వ్యవస్థలకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉంటుంది.ఈ క్షిపణిలో ఎంఐఆర్‌వీ టెక్నాలజీని వాడారు. దీని సహాయంతో ఒకేసారి పలు అణు లేదా సంప్రదాయ వార్‌హెడ్‌లను, అలాగే గగనతల రక్షణను మోసగించే డెకాయ్‌లను మోసుకెళ్లగలదు. ఒకేసారి వేర్వేరు లక్ష్యాలపై దాడి చేసేలా 10 వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం ఉందని అంచనా. సాధారణంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు అధిక కచ్చితత్వం కలిగి ఉండవు. కానీ డీఎఫ్5సీలో మాత్రం చైనా అభివృద్ధి చేసిన బైడూ నావిగేషన్ సిస్టమ్తో పాటు పలు టెక్నాలజీలు వాడారు. దీంతో 20,000 కిమీ దూరం ప్రయాణించినా కూడా లక్ష్యాన్ని ఖచ్చితంగా తాకగలదని చెబుతున్నారు.

# మరోసారి పరువు పోగొట్టుకున్న పాక్ ప్రధాని.. నవ్వుకున్న పుతిన్

పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్.. అంతర్జాతీయ వేదిక మీద పరువు పోగొట్టుకున్నారు. సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం జరిగిన సీన్.. తాజాగా మరోసారి రిపీట్ అయ్యింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఎదుట.. పాక్ ప్రధాని తన చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకోవడానికి నానా తంటాలు పడుతున్న వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్‌గా మారింది. తాజాగా చైనాలో నిర్వహించిన షాంఘై సహకార సదస్సు సమావేశం సందర్భంగా ఈ సీన్ కనిపించింది. పుతిన్ , పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భేటీ కార్యక్రమం జరిగింది. దీని కోసం పుతిన్ ఇయర్ ఫోన్ పెట్టుకుని భేటీకి రెడీ కాగా.. పాక్ ప్రధాని మాత్రం ఇయర్ ఫోన్ పెట్టుకోవడం రాక.. నానా తంటాలు పడ్డారు.చివరకు పుతిన్ స్పందిస్తూ.. తన చెవిలోని ఇయర్ ఫోన్ తీసి మరీ.. ఇదిగో ఇలా పెట్టుకోవాలి అని పాక్ ప్రధానికి చూపించారు. దాని ప్రకారం షరీఫ్ తన ఇయర్ ఫోన్ సెట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకోవడంలో ఇబ్బంది పడ్డ షరీఫ్.. నవ్వుకున్న పుతిన్ అనే క్యాప్షన్‌తో వీడియోని పోస్ట్ చేశారు. ఈ వీడియో చూసిన వారు మూడు సంవత్సరాల క్రితం కూడా ఇలానే జరిగింది.. అప్పుడు కూడా షరీఫ్ ఇదే సమస్యతో బాధపడ్డారు.. ఇలానే పుతిన్ ముందు పరువు పోగొట్టుకున్నారంటూ పాత వీడియోని కూడా షేర్ చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం అనగా 2022లో ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఈ టూర్‌లో భాగంగా పాక్ ప్రధాని షరీఫ్ పుతిన్‌తో భేటీ అయ్యారు. సమావేశం ప్రారంభం కావడానికి ముందు షరీఫ్‌కు ఇదే సమస్య ఎదురైంది. పాక్ పీఎం ఇయర్‌ఫోన్ పెట్టుకుంటుండగా.. అది సెట్ అవ్వక పడిపోసాగింది. దీంతో పక్కనే ఉన్న అధికారులు.. షరీఫ్‌కు సాయం చేశారు. అయితే గతంలో కూడా దీనిపై పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చాయి. నెటిజనులు, విదేశీ ప్రముఖులు ఈ సంఘటనను ట్రోల్ చేశారు. ప్రముఖ కమెడియన్ జిమ్మీ ఫాలన్ ఈ ఘటనపై స్పందిస్తూ.. 22 కోట్ల మంది పాక్ ప్రజలకు ఈ షరీఫ్ ప్రధాని అంటే ఆశ్చర్యం కలుగుతోంది అని కామెంట్ చేశారు.




# నగరంలో గణేష్ నిమజ్జనానికి సర్వంసిద్ధం..

- 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారుల అంచనా
- నిమజ్జనం రేపు మధ్యాహ్నం 1:30 గంటలోపు పూర్తిచేయాలని టార్గెట్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలో వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నగర వ్యాప్తంగా 303 కిలోమీటర్లు మేర గణేష్ శోభాయాత్రలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకొచ్చారు. నగరంలో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. 30 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భద్రత, రవాణా కోసం 160 గణేష్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయబడ్డాయని అధికారులు వెల్లడిరచారు.

నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులను, 72 కృత్రిమ కొలనులను ఏర్పాటు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు నిమజ్జన స్థలాల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రజల రక్షణ కోసం హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 200 మంది గజ ఈతగాళ్లను చెరువులు, కొలనుల వద్ద ఉంచినట్లు వెల్లడిరచారు. శానిటేషన్ కోసం 14,486 మంది సిబ్బందిని తీసుకున్నామని అన్నారు. నిమజ్జన యాత్ర మార్గాల్లో 56,187 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. రేపు 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఖైరతాబాద్ వినాయక నిమజ్జనం రేపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలోపు పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు వెల్లడిరచారు. నగరంలో వినాయక నిమజ్జనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు కూడా అలర్ట్ అయ్యారు. భారీ వర్షాలకు నగరంలోని పలుప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డే అండ్ నైట్ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికి 11,442 గుంతలను పూడ్చి వేసినట్లు స్పష్టం చేశారు. నేడు అర్ధరాత్రి వరకు నగర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.



# వరద సాయం రూ.16,732 కోట్లివ్వండి

ఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలను జాతీయ విపత్తుగా పరిగణించి ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. వర్షాలతో భారీగా పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, కేంద్రం తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో అమిత్ షా అధికారిక నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆగస్టు 25 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని.. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ విధ్వంసం జరిగిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,018 కోట్ల మేర నష్టం జరిగిందని వివరించారు. గతేడాది ఖమ్మంతోపాటు పరిసర జిల్లాల్లో భారీవర్షాల కారణంగా రూ.11,713 కోట్ల మేరకు నష్టం వాటిల్లగా, అప్పుడే దీనికి సంబంధించిన నష్ట అంచనా నివేదికను కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. ఈ రెండేళ్లకు కలిపి రూ.16,732 కోట్ల సాయాన్ని తక్షణమే అందించాలని కోరారు.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు నిధులివ్వండి**


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో ఆమె కార్యాలయంలో గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రంలో విద్యా నాణ్యత, పిల్లల పోషకాహారం అనే రెండు సవాళ్లను పరిష్కరించడానికి ప్రవేశపెట్టిందే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రోగ్రాం అని వివరించారు. 105 అత్యాధునిక రెసిడెన్షియల్ క్యాంపస్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఈ సమగ్ర విద్యా విధానం కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామని చెప్పారు.

**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వండి**

రూరల్ రోడ్ కనెక్టివిటీ ప్రోగ్రాం కింద ఖమ్మంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో గురువారం పెమ్మసానితో తుమ్మల భేటీ అయ్యారు.

ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో గిరిజనులు అధికంగా నివసిస్తున్నారని, ఈ ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ డ్రైనేజింగ్ నెట్‌వర్క్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తుమ్మల మీడియాకు వెల్లడించారు.





# చైనా, బ్రెజిల్ కూడా భారీగా సుంకాలతో విరుచుకుపడుతోందన్న ట్రంప్

పలు దేశాలు సుంకాలు విధిస్తూ చంపేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ‘‘చైనా సుంకాలతో చంపేస్తోంది. భారతదేశం కూడా టారిఫ్‌లతో మమ్మల్ని చంపుతోంది.బ్రెజిల్ కూడా భారీగా సుంకాలు విధిస్తోంది’’ అని ట్రంప్ వ్యాఖ్యానించారు. స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, టారిఫ్‌ల గురించి తనకు తెలిసినంతగా మరే దేశానికి అర్థం కాదని అన్నారు. భారత్‌పై 50 శాతం టారిఫ్ విధించడాన్ని ఆయన సమర్థించుకున్నారు.తమ దేశ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్ విధిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తమ వస్తువులపై సుంకాలు ఉండవని ఢల్లీ అంగీకరించిందని ఆయన అన్నారు. తాను తీసుకున్న చర్యలతో ఆయా దేశాలు టారిఫ్‌లపై దిగి వస్తున్నాయని తెలిపారు.ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్ అని ఆయన ఆరోపించారు. తాను చర్యలు తీసుకోకపోతే వారు దిగి వచ్చేవారు కాదని అన్నారు. అందుకే సుంకాలు ఉండాలని, తద్వారా ఆర్థికంగా బలపడతామని ఆయన వ్యాఖ్యానించారు. వివిధ దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు అక్రమమని ఓ ఫెడరల్ అప్పీల్ న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలపై కూడా ట్రంప్ స్పందించారు. ఈ కేసును ఇతర దేశాలు స్పాన్సర్ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నవంబర్ కల్లా ఒప్పందం కుదిరే ఛాన్స్..



**న్యూఢిల్లీ :** ప్రతీకార సుంకాల విధింపు నేపథ్యంలో అమెరికాభారత్ మధ్య వాణిజ్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రష్యా వద్ద నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతీకారంగా ట్రంప్ భారత్ మీద 25 శాతం అధిక సుంకాలు విధించడంతో... ప్రస్తుతం ఇండియా మీద అమెరికా సుంకాలు 50 శాతానికి చేరాయి. అయితే ట్రంప్ బెదిరింపులకు మోదీ సర్కార్ ధీటుగా బదులిస్తోంది. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో పీయూష్ గోయల్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వివరాలు... అమెరికాభారత్ మధ్య వాణిజ్య ఒప్పందం.. నవంబర్ కల్లా పూర్తవుతుందని తెలిపారు. అమెరికాతో వాణిజ్య చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై ఇరు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదురుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం నవంబరు నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని పీయూష్ గోయల్ అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత్‌తో వ్యాపార సంబంధాల పెంచుకోవడానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. దీనిలో భాగంగానే.. యూరోపియన్ యూనియన్‌తో కూడా త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. టారిఫ్‌ల అంశం మీద అమెరికాతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. అయితే, ఇండియా ఎప్పుడూ కూడా గడువు తేదీలు పెట్టుకుని చర్చలు జరపదని ఆయన స్పష్టం చేశారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ.. భారత దేశం ఎన్నడు కూడా డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదు. ఇరు వర్గాలకు ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చిస్తుంది అని పీయూష్ గోయల్ చెప్పుకొచ్చారు. మన దేశం సరఫరా వ్యవస్థ చాలా బలంగా ఉందని.. మన ఇతర దేశాల మీద ఆధారపడాల్సిన అవసరం కూడా లేదని పీయూష్‌గోయల్ స్పష్టం చేశారు. కాగా ఈ సంవత్సంర అనగా 2025లో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ సుంకాల విధింపు నేపథ్యంలో.. మార్చి నుంచి భారత్, అమెరికా.. ఇరు దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఇప్పటివరకు 5 రౌండ్ల చర్చలు పూర్తయ్యాయి. ఆరో రౌండ్ చర్చల కోసం అమెరికా ప్రతినిధుల బృందం 2025, ఆగస్టు 25న ఇండియాకు రావాల్సి ఉంది. కానీ వారు రాలేదు. ఆగస్టు 27 నుంచి ఇండియా మీద 50 శాతం సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఆరో దశ చర్చలకు ఇంకా కొత్త తేదీలను ప్రకటించలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# 37 ఏళ్లలో తొలిసారి పంజాబ్‌ను ముంచెత్తిన భారీ వరదలు




**చండీగఢ్:** భారీ వర్షాల ప్రభావంతో పంజాబ్ అతలాకుతలం అవుతోంది. గత 37 ఏళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితులు రాష్ట్రం ఎదుర్కొంటోంది. మొత్తం 23 జిల్లాలు వరదల ముప్పులో చిక్కుకున్నాయి.దాదాపు 1.48 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములు నీటమునిగిపోయాయి. ఇప్పటివరకు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 3.50 లక్షల మంది బాధితులను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతోంది. ఈ నెల 7వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నదుల పరివాహక ప్రాంతాల్లో జీవన విధానం పూర్తిగా దెబ్బతింది. స్థానికంగా కురుస్తున్న వర్షాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గురుదాస్‌పుర్, పఠాన్‌కోట్, కపుర్తలా, తరన్‌తారన్, ఫిరోజ్‌పుర్, హోషియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. రూప్‌నగర్, పటియాలా జిల్లాల్లో ప్రజలను అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేస్తున్నారు.ఈ క్రమంలో సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, బీఎస్ఎఫ్‌తో పాటు స్థానిక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. సీఎం భగవంత్ మాన్ ఇప్పటికే ఫిరోజ్‌పుర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. ఆయనతో పాటు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా గురువారం మరోసారి వరద ప్రాంతాలను పర్యటించనున్నారు. ఇదే సమయంలో ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా మంత్రులతో కలిసి తరన్‌తారన్ జిల్లా ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మరోవైపు ఆప్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా సహాయక చర్యల కోసం రూ.3.25 కోట్లు ప్రకటించారు.




# స్విగ్గీ ప్లాట్‌ఫాం ఫీ పెంపు

దేశీయ దిగ్గజ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు తమ యూజర్లకు ఊహించని షాకులిస్తున్నాయి. జొమాటో ప్లాట్ ఫాం ఫీజు పెంచిన మరుసటి రోజునే స్విగ్గీ సైతం పెంపు ప్రకటన చేసింది. ఫుడ్ డెలివరీ బిజినెస్ ప్లాట్ ఫాం ఫీ పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. అంతేకాదు గడిచిన 15 రోజుల్లోనే రెండోసారి ఈ ప్లాట్ ఫామ్ ఫీజు పెంచడం ఆన్‌లైన్ ఫుడ్ లవర్స్‌కి ఊహించని షాక్ అని చెప్పవచ్చు. ప్రస్తుతం స్విగ్గీలో ప్లాట్ ఫాం ఫీజును రూ.15కు పెంచింది. అయితే ఎంపిక చేసిన మార్కెట్లకే ఈ పెంపు వర్తిస్తుందని తెలిపి స్వల్ప ఊరట కల్పించింది. ఆగస్టు 14, 2025 రోజునే ప్లాట్ ఫాం ఫీ రూ.12 నుంచి రూ.14కు పెంచిన సంగతి తెలిసిందే. పక్షం రోజుల్లోనే మరో రూ.1 పెంచడం గమనార్హం. ఫుడ్ డెలివరీ ఆర్డర్లపై స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్ ఈ ఛార్జీలను విధిస్తున్నాయి. ప్రస్తుతం సిగ్గీలో ఈ ఫీజు 15కు చేరింది. అయితే, ఇందులోనే వస్తు సేవల పన్ను జీఎస్టీ సైతం కలిసి ఉంటుంది. స్విగ్గీ ప్రత్యర్థి సంస్థ అయిన జొమాటో సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం నుంచే ప్లాట్ ఫాం ఫీజును రూ.10 నుంచి రూ.12కు పెంచింది. ఈ పండుగల సీజన్‌లో డిమాండ్ ఉంటుందన్న అంచనాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇందులో జీఎస్టీ ఉండదని తెలిపింది. అంటే పన్నులు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.దిగ్గజ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తొలిసారి 2023, ఏప్రిల్ నెలలో ప్లాట్ ఫాం ఫీజు రూ.2 అమలులోకి తెచ్చింది. దానిని క్రమంగా రూ.12కు పెంచుతూ వచ్చింది. జొమాటో సైతం ఇదే విధానాన్ని అవలంబించింది. చివరి సారిగా జొమాటో 2024, అక్టోబర్‌లో మార్చింది. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ ప్లాట్ ఫాం ఫీజులను జొమాటో సవరించింది. అయితే, స్విగ్గీ మాత్రం 15 రోజుల్లోనే మార్చడం గమనార్హం. ఈ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్స్‌లో సగటు ఆర్డర్ విలువ రూ.500 600 మధ్య ఉంటోంది. దీంతో పోలిస్తే ఈ ప్లాట్ ఫాం ఫీజు అనేది చాలా తక్కువగా విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, తాజా పెంపుపై స్విగ్గీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మరోవైపు.. ఈ ఆర్థిక సంవత్సరం 2025 26 ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ లాస్ రూ.1197 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ బిజినెస్ ఇన్‌స్టా మార్ట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన క్రమంలో కంపెనీ నష్టం రెండింతలైనట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ప్లాట్ ఫామ్ ఫీ పెంచినట్లు సమాచారం.

# రియల్-టైమ్ షాపింగ్ కోసం



ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులో తీసుకొచ్చింది. దీని ద్వారా కస్టమర్లు మరింత సౌకర్యవంతంగా, సులభంగా షాపింగ్ చేసేందుకు వీలవుతుందని అమెజాన్ చెబుతోంది.లెన్స్‌లైవ్ పేరుతో ప్రారంభించిన ఈ ఫీచర్ ద్వారా కస్టమర్లు తమ చుట్టూ ఉన్న వస్తువులను స్కాన్ చేసి అమెజాన్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. ఇది గూగుల్ లెన్స్ మాదిరిగానే ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను అమెరికాలోని 10 లక్షలకు పైగా ఐఓఎస్ కస్టమర్లకు అనుమతిచ్చింది. త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని అమెజాన్ వెల్లడిరచింది. ఈ ఫీచర్‌ను ఉపయోగించి అమెజాన్ ద్వారా కెమెరా స్క్రీన్‌పై కనిపించే వస్తువులను స్కాన్ చేయవచ్చు. అనంతరం ఆ వస్తువుకు మ్యాచింగ్ ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేసుకోవచ్చు. లెన్స్‌లైవ్ ద్వారా కెమెరాలో కనిపించే వస్తువుపై ట్యాప్ చేయడం ద్వారా ఫోకస్ అవుతుందని, దాన్ని షాపింగ్ బాస్కెట్‌లోకి సేవ్ చేసే ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ ఫీచర్ అమెజాన్ తన ఏఐ అసిస్టెంట్ రుఫుసును కూడా వాడుకునే సౌకర్యం కల్పిస్తోంది. ఏదైనా ఉత్పత్తిని సెర్చ్ చేసే సమయంలో సమాచారం, ఇంటరాక్టివ్ కోసం ఇది పనిచేస్తుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) టెక్నాలజీ ఆధారంగా పనిచేయనుంది.

# నక్సలైట్లు లొంగిపోయే వరకు ఊరుకోబోము..



**న్యూఢిల్లీ :** మావోయిస్టులను అంతమొందించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చడమే మోడీ ప్రభుత్వ లక్ష్యమని తేల్చి చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్ట కొండలపై 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను విజయవంతంగా నిర్వహించిన సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, కోబ్రా జవాన్లు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా అమిత్ షా ప్రసంగించారు. నక్సలైట్లందరూ లొంగిపోయే వరకు లేదా నిర్మూలించే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. దేశంలోని తక్కువ అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలకు నక్సల్స్ తీవ్ర నష్టం కలిగించారని, పాఠశాలలు, ఆస్పత్రులకు అంతరాయం కలిగించారని, అంతేగాక ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. నక్సల్స్ ఏరివేత వల్ల ప్రజల జీవితాల్లో మార్పులు వస్తున్నాయన్నారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నొక్కి చెప్పారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ టైంలో జవాన్లు ప్రదర్శించిన ధైర్యం, పరాక్రమం నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల చరిత్రలో నూతన అధ్యాయంగా గుర్తుండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, డిప్యూటీ సీఎం విజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# బంగారం ధరలకు రెక్కలు....

భారతీయులకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తమ స్థోమతకు తగినట్లుగా ఎంతో కొంత బంగారం కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఏడాది పొడవునా బంగారానికి గిరాకీ ఉంటుంది. ఇటీవలి కాలంలో పసిడిని ఒక పెట్టుబడి సాధనంగా చూస్తున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేస్తే మంచి లాభాలు వస్తాయని, అత్యవసర సమయంలో ఆదుకుంటుందని ఎక్కువ మంది దీనిని ఎంచుకుంటున్నారు. దీంతో భారత్‌లో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగుతుందని, పసిడి ధరలు మరింత పెరుగుతాయని ఓ నివేదిక తెలిపింది. 2025 చివరి నాటికి 10 గ్రాముల బంగారం రేటు రూ.99,500 నుంచి రూ.110,000 మధ్య కదలాడుతుందని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకనామిక్ రీసర్చ్ గ్రూప్ తెలిపింది. అదే 2026 మొదటి అర్ధ భాగం ముగిసే నాటికి తులం బంగారం రేటు రూ.1,25,000 స్థాయికి చేరుతుందని అంచనా వేస్తోంది. 'మన అంచనాల కంటే డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి చాలా తక్కువ స్థాయిలో ట్రేడవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి రూపాయి విలువ రూ.8789 మధ్య ఉంటుంది. గ్లోబల్ గోల్డ్ ధరలు ఈ 2025లో ఇప్పటి వరకు 33 శాతం మేర పెరిగాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణతపై ఆందోళనలు బంగారం ధరలు పెరిగేందుకు దోహదపడ్డాయి. 2025 చివరి నాటికి అంతర్జాతీయ బులియన్ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 3400 3600 డాలర్ల మధ్య ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అది 2026 ఫస్ట్ హాఫ్ నాటికి 3600 నుంచి 3800 ఔన్స్ ధరకు చేరుకోవచ్చు. ' అని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకానమిక్ రీసర్చ్ గ్రూప్ అంచనా వేసింది. ఒక వేళ ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగితే బంగారం ధరలు మరింత పెరగవచ్చని తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధ అనిశ్చితుల మధ్య బంగారం కొనుగోళ్లు తగ్గినప్పటికీ, బంగారం ర్యాలీ తదుపరి దశ అమెరికా పరిణామాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక తెలిపింది. వీటిలో 202526లో ఫెడ్ రేటు తగ్గింపుల అంచనా వేసిన 125 బేసిస్ పాయింట్లు, యూఎస్ డాలర్ నుంచి కేంద్ర బ్యాంకులు, పెట్టుబడిదారుల్లో కొనసాగుతున్న వైవిధ్యీకరణ వంటివి ఉన్నాయని పేర్కొంది. ఇక దేశీయ మార్కెట్ విషయానికి వస్తే రుపాయి విలువ తగ్గడం, బంగారంలో పెట్టుబడులకు డిమాండ్ పెరగడం అనేది పసిడి ధరలు మరింత పెరిగేందుకు కారణమవుతున్నట్లుగా తెలిపింది. జూలై 2025లో భారతీయ దిగుమతులు 18 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పండుగల సీజన్‌లో దేశీయ డిమాండ్‌ను ఇది సూచిస్తోందని తెలిపింది.



# చట్టాలు చేయడం శాసనసభల పని, గవర్నర్లది కాదు..

**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం కోసం గడువు కోరుతూ రాష్ట్రాల దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం వరుసగా ఏడో రోజూ విచారణ చేపట్టింది. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు అత్యున్నత న్యాయస్థానంలో తమ వాదనలు వినిపించాయి. బిల్లులను నిలుపుదల చేసే విచక్షణాధికారాలను వ్యతిరేకించాయి. చట్టాలను రూపొందించడం శాసనసభల పని అని, గవర్నర్లకు అందులో ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశాయి. దీనికి సంబంధించి ఎటువంటి రూల్ సైతం లేదని పేర్కొన్నాయి. బిల్లును ఆమోదించాలని గడువు విధిస్తూ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేయడం ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్ఫూర్తిని బలహీనపరచాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపాయి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్‌కు పంపాక ఆయన దానిపై సంతకం చేయాల్సి ఉంటుందని తెలిపారు. కానీ నిరంతరం వాయిదా వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. అలాగే హిమాచల్ ప్రదేశ్ తరఫున మాజీ కేంద్ర మంత్రి ఆనంద్ శర్మ, కర్ణాటక తరఫున గోపాల్ సుబ్రమణియంలు వాదనలు వినిపించారు. సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. వాదనలు విన్న తర్వాత తదుపరి విచారణను ఈనెల 9కి వాయిదా వేసింది.




# సామాన్యులకు జీఎస్టీ బొనాంజా

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢల్లీలో జీఎస్‌టీ కౌన్సిల్ 56వ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో కేంద్రం ప్రతిపాదించిన జీఎస్‌టీ సంస్కరణలలో భాగంగా ప్రస్తుతం ఉన్న 12%, 28% పన్ను శ్లాబులను తొలగించి, రెండు శ్లాబులు మాత్రమే కొనసాగించనున్నారు. సవరించిన కొత్త రేట్లు ఈ నెల 22 నుంచే అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. లగ్జరీ వస్తువులపై మాత్రం 40 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. కౌన్సిల్ సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. జీఎస్టీ వ్యవస్థలో 2 శ్లాబులను మాత్రమే ఉంచాలని నిర్ణయించాం. దీనివల్ల రైతులు, సామాన్యులకు ప్రయోజనాలు లభిస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ, వైద్య రంగాలకు ఊరట లభిస్తుంది. సామాన్యులు, పేదలు కొనుగోలు చేసే వస్తువులపై ఇక నుంచి 5 శాతం, మిగిలిన వాటిపై 18 శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు. సమావేశంలో తీసుకున్న పూర్తి నిర్ణయాలను గురువారం బహిరంగంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతాల శ్లాబులతో ఉన్న జీఎస్టీ చట్టాన్ని మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం కేవలం రెండు ప్రధాన 5%, 18% శ్లాబులుగా మార్చింది. కొన్ని రకాల ఉత్పత్తులు, లగ్జరీ వస్తువులపై మాత్రం 40 శాతం జీఎస్టీ ఉంటుంది. ఈ నిర్ణయంతో అనేక వస్తువులపై పన్ను భారం తగ్గుతుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in